# హంసల రెక్కలు





డా॥ వి. చంద్రశేఖరరావు



అద్భుతాలు చేసే మనిషిగా ఆమెను నేను గుర్తుంచుకొంటాను. అతి సాధారణంగా కనిపించే ఆ మనిషి, మెత్తగా, మృదువుగా మాట్లాడే ఆ మనిషి, ఒక పరిచయంతోటే, నిరంతర జ్ఞాపకంగా మిగిలిపోతుంది. కాసేపు ఆమెతో మాట్లాడితే, ఒక ఆవేశభరితమైన ఉద్విగ్నతలోకి వెళతాము మనం. యమ్.ఎల్. ఉద్యమాల వారసత్వం ఆమెది. (పోలీసు రికార్డుల్లో ఆమె అరుణక్క.) ఇప్పుడూ ఏదో ఒక పోరాటం. ఆంధ్రదేశంలో అతి పెద్ద ఎన్జీవో ఆమె నడుపుతుంది. సెజ్‌లకు వ్యతిరేకంగా, గృహహింసకు వ్యతిరేకంగా; లీగల్ సెల్, రిహెబిలిటేషన్ సెంటరు; గొప్ప యాక్టివిస్టుగా, ప్రపంచం ఆమెను ఆరాధిస్తుంది. కానీ, నేను ఆమెను రచయితగానే ఇష్టపడతాను. ఫెమినిస్ట్, దళిత్ యాక్టివిజంలో భాగంగా ఆమె రచయితగా మారింది. మొదట్లో గుజరాతీ, మరాఠీ దళిత కథల్ని తెలుగులోకి అనువదించేది. నిప్పును అంటించి వదిలినట్లుగా, ఆ కథల్ని బుక్‌లెట్స్‌గా ప్రింట్ చేసి, పల్లెల్లో పంచేది. క్రమంగా ఆమె కథలు రాసింది. నవలలు రాసింది. ఆమె నవల 'మహాస్వప్నం'కు అకాడెమి బహుమతి వచ్చింది. ఆమె రచనలు ప్రత్యేకమైనవి. సోషల్ హిస్టరీ లాంటివి. అవి ఒక తరపు ఆత్మగానాలు.

ఆమె మాలతి, చనిపోతుంది. బహుశా ఈ రాత్రి ఆమె చివరి రాత్రి కావచ్చు. హాస్పిటల్‌లో, తన చివరి క్షణాల్లో ఉంది. సాయంత్రం ఆరు గంటల నుంచి, సత్యప్రకాశం కోసం ఎదురుచూస్తున్నాను. అతనితో కలిసి హాస్పిటల్‌కు వెళ్ళాలని నా కోరిక. ప్రకాశాన్ని చూసినపుడు ఆమె కళ్ళలో వెలిగే దీపాల్ని చూడాలని నా కోరిక. జెజె ఫోన్ చేశాడు. ''ఏమైంది, అందరూ నువ్వు వస్తావని ఎదురుచూశారు,'' అన్నాడు. ''వెళ్తాను. ఈ రాత్రి పొద్దుపోయినా వెళతాను. రాత్రంతా

ఆమెతో గడుపుతాను,'' అన్నాను. సత్యప్రకాశం గురించి ఎదురు చూస్తున్న సంగతి జెజెకి చెప్పలేదు. సత్యప్రకాశం గురించిన రహస్య గాథలు చాలామందికి తెలియవు. మాలతి రాసిన ఫిక్షన్‌లో అతనే ముఖ్యపాత్ర అని, నాలాంటి కొద్దిమందికే తెలుసు.

మాలతికి సంబంధించిన వరకూ, అన్నీ తానే అనుకుంటాడు జెజె. ఈ జెజె థియేటర్ పర్సన్. సంవత్సరానికో, రెండు సంవత్సరాలకో రవీంద్రభారతిలో ఒక నాటకాన్ని ప్రదర్శిస్తాడు. ప్రయోగాత్మక నాటిక. తానొక్కడే తెలుగు నాటక రంగానికి చిట్టచివరి ఆశ అని నమ్ముతాడు. మాలతి తాలూకు ఎన్జీవో యాక్టివిటీస్ అన్నిటిలో జెజె పాల్గొంటాడు. ముఖ్యంగా దళిత ఉద్యమాల్లో. జెజె ట్రూప్ పల్లెల్లో వీధి నాటకాలు, ఒగ్గుకథ, బుర్రకథ లాంటి జానపద రూపాల్ని ప్రదర్శిస్తుంటుంది. మాలతికి సెక్రటరీని అని చెప్పుకుంటాడు. అయితే సంస్థలన్నీ ఎప్పుడో అతని చేతిలోకి వెళ్ళిపోయాయి. ముఖ్యంగా బహుజన వికాసం, హెల్ప్‌ఫోరం ఫర్ చైల్డ్ ఎబ్యూజ్ అతనే చూస్తున్నాడు. ఈ జెజె గురించి చాలా స్కాండల్స్ ప్రచారంలో ఉన్నాయి. "లైఫ్ ఈజ్ ఎ బిచ్ అండ్ ఐ లివ్ యిట్,'' అనేది అతని ఫిలాసఫీ. మాలతి కన్నా ఐదారేళ్ళు చిన్నవాడు. అతన్ని తన సహచరుడిలా పరిచయం చేస్తుంది మాలతి.

సాయంకాలం ఎనిమిదైంది. సత్యప్రకాశం రాలేదు. తొమ్మిది దాటాక, సత్యప్రకాశం మరింక రాడని నిర్ణయించుకొని, హాస్పిటల్‌కు ఒక్కడినే వెళ్ళాను. మాలతి, అలసిపోయి నిద్రపోతుందని చెప్పారు. ఆమె గది బయట యాభైమంది దాకా కూర్చున్నారు. దళిత స్త్రీలు, వాళ్ళ పరిభాషలో ఆమె వాళ్ళకు 'అమ్మ.' టి.వి. క్రూ కూడా ఉన్నారు. గత నెలరోజులుగా ఆమెపై స్పెషల్ స్టోరీలు ప్రసారమవుతూనే వున్నాయి. లోపలికి వెళ్ళి కనీసం, ఆమెనొకసారి చూసి, (ఆమెను ముట్టుకొని) రావాలని కోరిక. నర్సులు వెళ్ళనివ్వలేదు. తిరిగి వస్తుండగా సత్యప్రకాశం ఫోన్. "నేను రాలేను. మాలతినట్లా చూడలేను. ఎముకల గూడులా, అవయవాల మూటలా. వద్దు కాంతిరేఖలా





తళుక్కుమనే తన రూపం ఇంకా నా కళ్ళలో ఉంది. ఆ రూపాన్ని అట్లాగే ఉండనివ్వు," అన్నాడు. సత్యప్రకాశం గొంతులో దుఃఖం. హఠాత్తుగా పెద్ద పెట్టున ఏడ్చాడు.

పది దాటింది. రాత్రి బరువుగా ఉంది. దుఃఖపు వీధిలో ప్రయాణంలా. గుండెల్లో తెలియని వెలితి, ఖాళీతనం, దిగులు. అలరించే మధుర స్వప్నమేదో, హఠాత్తుగా అదృశ్యమవుతున్నట్లు; కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. చావు, మనిషి నింతగా బాధపెడుతుందా? మిత్రులందరికీ ఫోన్ చేశాను. మనూ, ఉమ, దాయీ, ఆనందూ, ప్రభు, కోకిల మేడమ్. ఎక్కడైనా కూర్చుందాం అనుకున్నాము. ప్రభు ఇంటిలో కలిశాము. అందరూ, ఒక దుఃఖపు బరువుతో, ఖాళీ చూపులతో ఉన్నారు. చాలాసేపు ఎవరం మాట్లాడుకోలేదు. సుదీర్ఘమైన మౌనంలాంటి సందర్భంలో, కోకిల గొంతు విప్పింది. వాళ్ళ స్నేహం గురించి మాట్లాడింది. యూనివర్సిటీ రోజుల గురించి చెప్పింది. మాలతి, పరీక్షల వాయిదా, హాస్టల్ సమస్యల గురించి, ధర్నా మొదలుపెట్టడం. అదో పెద్ద ఉద్యమం అయింది. యూనివర్సిటీ రోజుల్లో మాలతి రూము ఒక పాఠశాలలా ఉండేది. పదో ఇరవయ్యో మంది అక్కడ చేరి. తీవ్రమైన చర్చలు జరిగేవి. వెన్నెల రాత్రుల్లో హాస్టల్ ముందు గార్డెన్‌లో కూర్చుని మధురమైన పాటలు పాడుకునే వాళ్ళు. మాలతి మంచి గాయని. ట్రెసీ బాడ్‌మన్, మేరీ హాప్‌కిన్స్, ఆఫ్రికన్ ఫోక్ సాంగ్స్, యూనివర్సిటీకి కొత్త పాటలు నేర్పింది. కోకిల జ్ఞాపకాల పొదలా మారిపోయింది. ఉమ, ఆమె తొలినాటి రచనల గురించి మాట్లాడేడు. అప్పట్లో ఆంధ్రజ్యోతి, సృజనలలో ఆమె రాసిన కథలు, ఎంత గొప్పవో వివరించాడు. సాహిత్య అకాడెమీ అవార్డు తెచ్చుకున్న 'మహాస్వప్నం' మహా కావ్యమన్నాడు దాయీ. క్రమంగా ఆమె పర్సనల్ లైఫ్‌లోకి మా కబుర్లు మళ్ళాయి.

రాత్రి పదకొండు దాటింది. జెజె నుంచి ఫోన్ వచ్చింది. "హాస్పిటల్‌కు వెళుతున్నాను, మాలతి దగ్గరకు," అన్నాడు. "ఇప్పుడా,

ఇప్పుడెందుకు ఆమెను డిస్టర్బ్ చెయ్యటం,'' అన్నాను. ''మాలతి చనిపోయింది. సరిగ్గా పదిగంటల యాభై నిముషాలకు. హాస్పిటల్ నుంచి ఫోన్ వచ్చింది,'' జెజె ఏడుస్తున్నాడు. ''దేవుడా,'' అంటూ నుదుటిపై కొట్టుకున్నాను. ''సాయంకాలం హాస్పిటల్‌కు వెళ్ళీ కూడా ఆమెను చూడకుండా వెనక్కు వచ్చాను. ఆమెను సజీవంగా చూడలేక పోయాను,'' నా కళ్ళనిండా నీళ్ళు. దుఃఖం తోసుకువచ్చింది. ముఖాన్ని చేతుల్తో కప్పుకొని. జెజె మాట్లాడుతున్నాడు. ''ఆమె వెళ్ళిపోవటమే మంచిదయింది. ఎంత బాధను అనుభవించింది. ముఖ్యంగా రేడియో థెరపీ. ఎంత నరకమది. సజీవంగా తగలబడుతున్నట్లు; ఆమె దగ్గర ఒక రకమైన కమురు వాసన వచ్చేది. బహుశా పూలతోటలు తగుల బడుతున్న వాసన కావచ్చు. ఆమె వెళ్ళిపోవటమే మంచిదయింది,'' అన్నాడు దిగులు గొంతుతో. నేనింకా నమ్మలేని ఒక స్థితిలో ఉన్నాను. మనసు, ఈ నిజాన్ని అంగీకరించడానికి ఇష్టపడటం లేదు.

''ఒక కథ ముగిసింది. తను నడిచి వచ్చిన సంవత్సరాలన్నింటినీ తన వెంట తీసుకువెళ్ళింది. ఇప్పుడంతా ఒక ఖాళీతనం. దుఃఖపు కార్చిచ్చు ఒకటి భగభగ మండుతూ,'' జెజె ఉద్వేగంగా మారి పోయాడు. ''ఆమె శరీరాన్ని, ఈ రాత్రికి హాస్పిటల్‌లోనే ఉంచుతాము, పొద్దున్నే తన బంగళా 'జన కుటీరా'నికి తీసుకెళతాము. అందరూ రండి. మరపురాని వీడ్కోలుగా ఆమెను సాగనంపుదాం,'' అన్నాడు.

మిత్రులందరం, భయపెట్టే మౌనంగా మారిపొయ్యాము. కోకిలే ముందు తేరుకుంది. ''మరణమొక నిజం. దాన్ని అంగీకరించడం మినహా మనమేం చెయ్యలేము,'' అంది. చాలాసేపు ఎవరం మాట్లాడలేక పొయ్యాము. అనంత్ ముందుగా తేరుకొని, ఒక కవితను చెప్పాడు. అదొక ఎలిజీ. కోకిల, తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేసిన మాలతి ఎప్పుడో పాడిన సినిమా పాటను వినిపించింది. (ఆ చల్‌కె తుజే, మే లేకుమ్ తుజే, ఇక్ ఐసె గగన్‌కి తలే, జహ వంఖి నహీ,





ఆసూ భి నహీ.) దాయీ, పుస్తకాల షెల్ఫ్‌లోంచి మాలతి నవల 'మహా స్వప్నం తీసుకువచ్చాడు. పుస్తకాన్ని తెరచి చదవటం మొదలుపెట్టాడు. అందరం, మెడిటేషన్‌లాగా, ఆ నవలాభాగాన్ని వినడం మొదలు పెట్టాము.

నా జేబులో మాలతి రాసిన ఉత్తరం. రెండు మూడు నెలలు గా ఆ ఉత్తరం నా జేబులోనే ఉంది. అదే ఆమె చివరి ఉత్తరం కావచ్చు. వణుకుతున్న చేతులతో ఆ ఉత్తరాన్ని తీసి పెద్దగా చదవటం మొదలుపెట్టాను.

శేఖరం,

ఈమధ్య ఎవరికీ ఉత్తరాలు రాయలేదు.

చాలా ఏళ్ళయింది. ఎవరికైనా ఉత్తరం రాసి. ఇప్పుడిలా, నీకు. మధ్యాహ్నంపూట పోస్ట్‌మేన్ కోసం ఎదురుచూసే రోజులు ఇంకా గుర్తు న్నాయి. ఒక సెప్టెంబరు మధ్యాహ్నం, సన్నని జల్లు పడుతున్నపుడు, పోస్ట్‌మేన్ ఒక అందమైన కవరు ఇచ్చి వెళ్ళాడు. నందలాల్ బోస్ స్టాంప్ ఉన్న ఫస్ట్ డే కవర్ అది. అది నువ్వు రాసిన ఉత్తరం. గుండ్రటి అక్షరాలు. ఎంత ఆత్మీయమైన ఉత్తరమది. హృదయనివేదన లాంటి ఉత్తరమది. ఆ రోజు నుంచీ నీ ఉత్తరాలు నాకిష్టమైన అనుభూతుల్లో ఒకటి.

ఆరోగ్యం బాగాలేదు. ఓపిక లేదు. ఒట్టి శరీరం. ఆత్మ ఖాళీ చేసి వెళ్ళడానికి సిద్ధం అవుతుంది.

నాకిష్టమైన వాళ్ళందరికీ ఉత్తరాలు రాయాలని; నా ఎదురుగా, నా రచనలన్నీ కలిపి వేసిన ఒక పెద్ద పుస్తకం. అట్టపై బాపు వేసిన రేఖాచిత్రం. నేనేనా అది; వెండి వెలుగులు విరజిమ్మిన, ఒకానొక కాలం అది; అప్పటి నేను కాబోలు; (క్రింద ఆఫీసులో గొడవగొడవగా ఉంది. సెజ్‌లకు వ్యతిరేకంగా ఒక ర్యాలీ కోసం ఏర్పాట్లు. ఎన్.ఆర్.ఐ. మొగుడు పై కోపంగా అరుస్తుందో పెళ్ళికూతురు. ఏసిడ్ దాడి జరిగిన

పాప ఒక మూలన కూర్చుని ఉంది. లాయర్లు, యాక్టివిస్టులు నా స్పిరుట్యుల్ ప్రపంచం; ఇప్పుడంతా జెజెనే చూస్తున్నాడు.)

హైదరాబాద్ వచ్చి ఇరవైయేళ్ళు అవుతుంది. యూనివర్సిటీకి దగ్గరలో రామ్‌నగర్ గుండులో ఉండేదాన్ని. చిన్న గది, గది నిండా మిత్రులు. ఎంత అద్భుతమైన రోజులవి. నా మొదటి రెండు నవలలు అప్పుడే రాశాను.

ఇరవై ఏళ్ళ అమ్మాయి నన్ను వెతుక్కుంటూ వచ్చింది. తన చేతుల్లో నా కొత్త నవల 'మళ్ళీ జీవితంలోకి.' బెరుకుగా, భయంగా, ఆటోగ్రాఫ్ కావాలంటూ; ఆ రోజంతా ఆ అమ్మాయి నాతోనే ఉండి పోయింది. యూనివర్సిటీల నుంచి ఫ్రెష్‌గా బయటికచ్చిన అమ్మాయి. ఎన్నో సందేహాలు, భయాలు. ప్రేమంటే ఏమిటి? అనే ప్రశ్నతో మొదలు పెట్టి, పెళ్ళిలో సమానస్థాయి సహజీవనం సాధ్యమేనా అంటూ, ఎంత అమాయకంగా అడిగింది. టోనీ మోరిసన్, ఏలిస్ వాకర్ లాంటి బ్లాక్ అమెరికన్ రచయితలను, నాకు పరిచయం చేసింది ఆ అమ్మాయి. ఆ తరువాత చాన్నాళ్ళపాటు, మేము ఉత్తరాల స్నేహితులుగా; ఒక పేరా ఉత్తరాలు ఆమెవి. నాకెంతో యిష్టమైన ఆ మనిషి 2001లో చనిపోయింది. సూసైడ్ చేసుకుంది. ఇద్దరు పిల్లలు. అతనో బిజినెస్ మాన్. చాలా యేడ్చేను. నాకు ఏడవటం వచ్చా అన్నట్లు యేడ్చాను.

నీకు ఉత్తరం రాసేముందు, ఆ అమ్మాయి రాసిన ఉత్తరా లన్నీ బయటకు తీసి, చదువుకొని, గుట్టలు గుట్టలుగా ఈ ఉత్తరాలు. ఏం చేయాలీ ఉత్తరాలు, చించి పారవేయలేను. అలా అని దాచు కోలేను.

ఇదంతా నీకు ఎందుకు రాస్తున్నానో తెలియదు. బహుశా లోపల గురగురమంటున్న జ్ఞాపకాలేవో, ఇట్లా 'వల్లె' వేస్తున్నానేమో. నా తలపైని జుట్టు రాలిపోయింది. కనుబొమల పైని వెంట్రుకలు కూడా. అద్దాన్ని చూసుకోవటం మానివేశాను. తల చుట్టూ ముఖం చుట్టూ నాలుగైదు పొరల 'స్కార్ఫ్' చుట్టుకొని; రూపం ముఖ్యంకాదు,





అని వాదించే నేను, ఒక పురా దుఃఖ స్వప్నంలా నన్ను నేను మాస్క్ చేసుకొని;

మా నాన్న గుర్తుకొస్తున్నారు. నాకు తెలిసిన మొట్టమొదటి ఆధునిక మానవుడు ఆయన. కులాన్ని ద్వేషించేవాడు. ఆయన పేరు వెనుక నున్న కుల సూచకాన్ని ఆ రోజుల్లోనే ఆయన తీసివేశాడు. ఆయన హేతువాది. భగవంతుడిని తెలియని బాల్యం నాది.

నా తొలి గురువు ఆయనే. 'డిక్లైన్ ఆఫ్ వెస్ట్'ను పాఠ్యగ్రంథంలా చదివించాడు. రష్యన్ నవలలు, చలం కథలు, శ్రీశ్రీ కవితలు ఆయనే నాకు మొదటిసారి పరిచయం చేశాడు. కారల్‌జంగ్, కామస్, ఎడ్లర్, నాకు అర్థం కాని కొత్త సంగతులన్నీ వివరించేవాడు. "అర్థం కాకపోయినా లోపల రికార్డు చేసుకో. పదేళ్ళ తరువాత, అది నీకు ఉపయోగపడతాయి," అనేవాడు.

లాల్చీ, పంచె, పొడవుగా. రింగుల జుట్టు. అప్పట్లో ఆయన నా హీరో. (ఎవరికీ ఉపయోగపడని బతుకు, ఒక ఇల్లా, పొలమా అంటూ మా అమ్మ ఆయన్ని నిరసించేది.) నాకింకా బాగా గుర్తు, ఒక సాయంకాలం ఊపిరి తీసుకోనంత దగ్గు వచ్చి, రక్తపు ముద్దలు కక్కుకొని, నాకు పాతికేళ్ళు నిండక ముందే ఆయన అదృశ్యం అయిపోయాడు.

ఆయన ఇప్పుడుంటే ఎంత బాగుండు అని ఎన్నోసార్లు అనుకున్నాను. నీకు గుర్తుందా? 'మహాస్వప్నం' నవల వచ్చిన కొత్తలో, 'చివరి చాప్టర్ అర్థం కానట్లుగా ఉంది, అది అబ్సర్డిజమా, మాజిక్ రియలిజమా, ఎందుకట్లా మీ శైలికి భిన్నంగా రాశావు,' అని రాశావు.

నా గురించిన సంగతులవి. నేరుగా చెప్పటం ఇష్టం లేకపోయింది. అతనంటే నాకిష్టం. కలిసి జీవించాలని ఆశపడ్డాను. అతను జైల్లో ఉన్నాడప్పుడు. తల్లడిల్లిపోయాను. అతన్ని విడిపించడానికి చాలా కష్టపడ్డా. అతన్ని గుర్తు చేసుకోవాలని ఉంది. నేనెంతగానో ఇష్టపడే వ్యక్తి. ఎంతగానో ద్వేషించే వ్యక్తి.

అతన్నిప్పుడు గుర్తు చేసుకోవాలి.

నవలలోని పదహారో చాప్టర్, ఇలా మొదలౌతుంది.

“అతన్ని అరెస్ట్ చేశారు. చాన్నాళ్ళ వరకు ఆ సంగతి ప్రపంచానికి తెలియదు. చివరికొకరోజు కోర్టులో హాజరుపరచారు. అతని రూపం భయం గొలిపేదిగా ఉంది. శరీరం పైన చర్మాన్ని వలిచేశారు. అతనో మాంసం ముద్దలా ఉన్నాడు. పచ్చిపచ్చిగా ఉన్నాడు. మాంసపు వాసనలా, శరీరంపై ముసిరిన వందలాది ఈగలతో, చర్మం లేని శరీరం, కుళ్ళి రసిక కారుతూ, భీకరమైన దుర్గంధం...”

296వ పేజీలోని ఇంకో పేరా, అతని కోసం నేను పడ్డ శ్రమ లేదా త్యాగం(?) గుర్తు చేస్తాను.

“అరుణ అతనికి అడెంటెంటుగా మారింది. అతనికి డ్రెస్సింగ్ చేస్తూ, ఆహారం తినిపిస్తూ, నెలరోజుల పాటు అతనికితోనే, హాస్పిటల్‌లో ఉంది. (జైలు నుంచి హాస్పిటల్‌కు తరించారు అతన్ని.)

అతనోరోజు అరుణతో, “నన్ను ప్రేమిస్తున్నావా?” అని అడిగాడు. “ప్రేమించటం గాదు, నన్ను ఆహించాలి,” అన్నాడు.

ఇంకా పచ్చిగా ఉన్న శరీరాన్ని దగ్గరకు జరుపుకుంది అరుణ. అతని చుట్టూ చేతుల్ని పెనవేసింది. రెండు సన్నటి మాంసపు ముద్దల్లా ఉన్న అతని పెదాల్ని గాఢంగా ముద్దు పెట్టుకుంది.

అతను మళ్ళీ జీవించటం మొదలుపెట్టాడు. అతని చర్మం చిగురిస్తున్నట్లుగా అనిపించేది. శిశువుగా అతన్ని తనలోకి ఇముడ్చుకునేది. రక్తపు తడిలో నానినట్లుగా ఉండేది ఆమెకు. అతనో రోజు అరుణతో అన్నాడు, “ఈ ప్రేమ చాలదు. నన్ను పూర్తిగా ఆక్రమించుకో. నా చుట్టూ కవచంలా అల్లుకుపో. నన్ను ఆవహించు. అమూర్త భావంలా, ఇంద్రజాలంలా, పునరుజ్జీవనాన్ని సాధించే మహాకాంక్షలా, నన్ను ఆవహించు,” అన్నాడు.

అప్పుడు అరుణ, అతని శరీరంపైని రక్తాన్ని, చీమును దూదితో తుడుస్తుంది. “నీ లోపలికి ప్రయాణించాలని ఉంది,” అన్నాడు





ఆమెను దగ్గరకు తీసుకుంటూ. ఆమె చెవుల దగ్గర, "ఒట్టి సెక్స్ కాదు, దైవత్వంతో కూడిన ఒక అనుభవం కావాలి," అని గొణిగాడు.

"చెప్పు ఏం కావాలి?" అంది అరుణ.

"నాకు నీ చర్మం కావాలి. అట్లా అయితే నీ స్పర్శ శాశ్వతంగా నాలో ఉండిపోతుంది," అన్నాడు.

అరుణ చాలా ఇష్టంగా, "సరే," అంది.

విశాలమైన బల్లపై పడుకోబెట్టి, స్కాల్‌పెల్‌తో ఆమె శరీరంపై కోశాడు. తల దగ్గర మొదలుపెట్టి పాదం వరకూ, ఆమె చర్మాన్ని వలిచేశాడు. కత్తి అంచు తాలూకు మరణ శీతలత్వానికి ఆమె వణికి పోయింది. తన శరీరాన్ని, దానిపై చిప్పిలే రక్తాన్ని చూసి ఆమె పెద్దగా ఏడ్చింది. అప్పటికే అతను అరుణ శరీరం నుంచి ఆమె చర్మాన్ని వేరు చేశాడు. దాన్ని జాగ్రత్తగా, ఇంకా పచ్చిగా ఉన్న శరీరం చుట్టూ కప్పుకొన్నాడు... ఆ రాత్రే, ఒక అద్భుతం జరిగింది. అతి శీతలమై, ఘనీభవించిన, ఆమె శరీరంలో రసాయనిక మార్పులేవో జరిగి, మాంసపుముద్దలా ఉన్న ఆమె శరీరంపై పలుచటి చర్మపుపొరలేవో మొలవటం మొదలుపెట్టాయి. ఉదయానికి ఆమె శరీరం కొత్తగా, శిశువు చర్మంలా మృదువుగా, మెత్తగా, కాంతిమయంగా మారింది. ఆమె కళ్ళు తెరిచింది. దేవతామూర్తిలా అన్నివైపులకు చూసింది. ఆమె కళ్ళలో సరికొత్త స్వప్నాలు. 'ఇదిగో చూడు ప్రేమ గెలిచింది. మనం కొత్తగా మళ్ళీ పుట్టాము,' అంటూ అతని కోసం చూసింది. అతను లేడు. పోలీసులకు సరెండరయి, పారిపోయి, మరణించిన దేవుడిలా...

గుర్తొచ్చిందా, నవలలోని ఆ పేజీ. వివరాలేమీ చెప్పను. కానీ దాదాపు మరణపు అంచుల దాకా వెళ్ళాను.

అతనెందుకు ఇప్పుడు గుర్తుకు రావటం?

అతనో సింబల్. డికడెన్స్‌కు గుర్తు. ఇవాళ రేపు నాయకు లందరూ అతని నమూనాలే.

రెండు కప్పుల సూప్. నా ఎదురుగా గంట నుంచి ప్రయత్ని స్తున్నాను ఆ సూప్‌ను తాగాలని. అయిష్టంగా ఉంది. ఇట్లా ఎందుకు జీవించాలని కూడా, ఒక ఆలోచన.

కాసేపాగితే గుంపులు గుంపులు జనం వస్తారు. బొకేలు, సానుభూతులు. ఏం చేసుకోనివి? దేన్ని తిరిగి ఇవ్వగలవు ఇవి?

రాస్తూ, రాస్తూ నా కళ్ళ నిండా నీళ్ళు. నిన్నటి మొన్నటి ధీర వనితను కాదు. ముసలితనం వచ్చేసింది. ఎందుకో అందర్నీ పలకరించాలని ఉంది. మిమ్మల్నందరినీ ముట్టుకోవాలనిపిస్తుంది. మోహిని, లక్ష్మి, రాగిణి, సదా, నువ్వు, శివ, మారుతి, ఎంతమంది- మిమ్మల్నందర్నీ దగ్గరకు తీసుకోవాలని ఉంది.

సత్యప్రకాశాన్ని క్షమించాలని ఉంది.

ప్రపంచానికి నా అపాలజీ చెప్పాలనిస్తుంది.

అవును, అపాలజే.

ప్రేమతో

మాలతి

ఆ ఉత్తరాన్ని రెండోసారి చదివించుకొంది కోకిల. ఆ తరువాత మేం మాట్లాడుకోలేదు. మాట్లాడుకోవాలనిపించలేదు. అట్లాగే మౌనంగా బయటికి వచ్చాము. ఇళ్ళకు బయలుదేరాము. వీధి మలుపు తిరుగుతుండగా సెల్‌ఫోన్ మోగింది. అప్పటికి రాత్రి పన్నెండు కావస్తుంది. పద్మ ఫోన్ అది.

“త్వరగా రా, కాఫీహౌస్‌లో అందరం ఉన్నాము. మాలతీ మేడం కూడా ఇక్కడుంది,” అంది పద్మ.

“మాలతా? మాలతి చనిపోయింది కదా,” అన్నాను.

“కానీ, తను ఇక్కడుంది. హాస్పిటల్‌లో పడుకొని విసుగేస్తుంది. ఎక్కడికైనా తీసుకెళ్ళు అని అడిగింది. మినర్వా కాఫీహౌస్‌కు తీసుకొచ్చాను. ‘అందర్నీ ఒకసారి చూడాలి, కబురు చెయ్యి,’ అంది.





అందరికీ ఫోన్ చేస్తున్నాను. మహి, ఇంద్ర, జెజె, దాము వచ్చేశారు. నిన్ను చూడాలంటుంది. వచ్చేసెయ్యి,'' అంది పద్మ.

కాఫీహౌస్ ఖాళీగా ఉంది. కిటికీ పక్కన టేబుల్; వాళ్ళందరూ టేబుల్ చుట్టూ, దగ్గరగా, ఆత్మీయంగా, మధ్యలో మాలతి. బలహీనంగా, పాలిపోయిన ముఖంతో; కానీ తన ముఖంలో ఏదో వెలుగు, సంతృప్తి, సంతోషమో; తెల్లటి శాలువాను కప్పుకొని, మాలతిని అలా చూడటం ఎంతో బాగుంది.

మాలతి పక్కనే పద్మ, మాలతి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని, మృదువుగా నిమురుతూ. మాలతి వెనుకన కూర్చున్నాడు కవి సత్యశివం. రెండేళ్ళ క్రితం ఏక్సిడెంట్ అయి, ఫ్రాక్చర్ అయి, నెలల పాటు మంచం పైనే; శక్తుల్ని కూడగట్టుకొని, మళ్ళీ పునరుజ్జీవిస్తూ; నేను వెళ్ళేసరికి పోయమ్ చదువుతున్నాడు. వెయిటర్ పది కాఫీలు తెచ్చి, టేబుల్ పై పెట్టాడు.

నాకింకా నమ్మలేనట్లుగా ఉంది. ఏది నిజం. ఆమె చనిపోవటమా? లేదా ఇలా మిత్రుల మధ్య ఉల్లాస సమయంగా బ్రతికి ఉండటమా?

కాఫీ తాగుతూ, మాలతి హఠాత్తుగా, ''ఎందుకో నాకు 'స్మైల్'ని, 'పతంజలి'ని చూడాలనిపిస్తుంది. ఎందుకో వాళ్ళు చనిపోయినట్లు అనిపించటం లేదు. ఎక్కడో దాక్కుని ఉన్నారనిపిస్తుంది. హఠాత్తుగా ఏ సమూహం మధ్య నుంచో వాళ్ళ ముఖం తళుక్కుమని, వాళ్ళు నా వైపు చెయ్యి ఊపుతున్నట్లుగా అనిపిస్తుంది. 'సలామ్ స్మైల్ సాబ్', అంటూ పెద్దగా అరవాలనిపిస్తుంది,'' అంది.

కిటికీ అద్దంలోంచి బయట స్ట్రీట్‌లైట్లు మిలమిలలాడుతున్నాయి. రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి.

జెజె, మాలతి రాసిన నాటకంలోని ఒక సన్నివేశాన్ని నటించి, చూపుతున్నాడు. 'హామ్లెట్' పాత్రకు ఆధునిక రూపం. చేతులు పైకెత్తి, గంభీర స్వరంతో; మెస్మరైజింగ్‌గా ఉంది. ''నా చుట్టూ ఉన్న మిత్‌ని,

స్కాండల్స్‌ని పక్కకు తోసి, నన్నో మనిషిగా చూడండి. నన్ను ప్రేమగా ముట్టుకోండి. ఒక ప్రేమపూర్వకమైన వీడ్కోలు చెప్పండి. సంతృప్తితో మీ మధ్య నుంచి వెళ్ళిపోతాను. పిసరంత దిగులును, రెండు కన్నీటి బొట్లను ఇక్కడ వదిలి వెళతాను.'' ఖాళీ హోటల్లో జెజె స్వరం ప్రతిధ్వ నిస్తుంది.  మాలతి విస్మయంగా, ఆరాధనగా అతని వైపు చూస్తుంది. చెంపల పై చెయ్యి ఆనించుకొని; మాలతిని ఆ భంగిమలో చూడటం బాగుంది.

హఠాత్తుగా మాలతి నావైపు చూసి, ''హాస్పిటల్లో ఉన్నప్పుడు ఒక్కసారైనా నన్ను చూడడానికి రాలేదే,'' అంది, నావైపు సూటిగా చూస్తూ. ''అయామ్ సారీ,'' అంటూ మెల్లిగా నసిగాను.

''ఇంకా దగ్గరగా రండి. కుర్చీలు దగ్గరగా జరుపుకోండి. ఐ వాంటు ఫీల్ ఆల్ ఆఫ్ యూ. గుండెల్లో ఏదో వెలితి. మిమ్మల్నందర్నీ నాలో నింపు కోవాలనిపిస్తుంది,'' అంది.

ఇక్బాల్ తను రాసిన ఆబిట్యురీ బయటకు తీశాడు. ''చదివేనా,'' అన్నాడు. ''ఇది సంతోష సమయం. నో అబిట్యురీస్, నో ఎలిజీస్. మరణపు వాసనలేని ప్రపంచం అంటే నాకిష్టం. కాసేపు మరణాన్ని నిషేధిద్దాం,'' అంది.

సత్యశివం, తన లాల్చీ జేబులోంచి, కాగితాల బొత్తి బయటకు తీశాడు. ఒక కాగితాన్ని తీసి, ''ఇది నువ్వు వినని పోయమ్. చదువు తాను, విను,'' అన్నాడు. ''ఇట్ సౌండ్స్ లైక్ ఏన్ ఎలిజీ,'' అని అయిష్టం గా ముఖం పెట్టింది మాలతి.

''నేనో పాట పాడుతాను,'' అంది పద్మ. ''ఓహో, యాత్రికుడా'' పాతకాలపు ఆకాశవాణి పాట, మాలతి ఎంతో యిష్టంగా వుంది.

మాలతి ఎప్పటివో కబుర్లు బయటకు తీసింది. ఆమె సన్ని హిత మిత్రులు, కవులు, విప్లవ యోధులు, బాలెడర్స్, అందరూ, ఆ కబుర్లలోంచి మమ్మల్ని పలకరించారు.





రాత్రి పన్నెండు దాటింది. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. అంతా అద్భుతంగా, ఒక ఇంద్రజాలిక అనుభవంలా ఉంది. కాసేపు మేము ఆనందయోగులమయ్యాము. జీవితం, ఒక సాఫల్య ప్రయాణం అనిపించంది. ఈ స్నేహాలు, పరిచయాలు, ఈ కవిత్వం, కథలు, ఉద్యమాల గురించి ఉద్రూతలూగడం, ఎవరో హఠాత్తుగా గొప్ప వెలుగు మాపై జూమ్ చేసి, మేము దేవతల్లా మెరిసిపోయాము. మాకిష్టమైన జీవితాన్ని మేము జీవించాం. మాదొక స్వర్గం. ప్రపంచాన్ని కాలితో పక్కకు తోసి, మా మార్గం, ఇది మా ప్రపంచం. ఇది మాకిష్టం, ఇష్టం అని ప్రకటిస్తున్నట్లుగా.

"మాలతీ నిన్ను చూడటం బాగుంది. జీవితం పై గొప్ప నమ్మకాన్ని, ప్రేమను పెంచే మనిషివి నీవు. నిన్ను సజీవంగా చూడలేనేమో అని భయపడ్డాను," అన్నాను ఎంతో ఉద్వేగంతో.

అందరం ఒకరికొకరం వీడ్కోలు చెప్పుకుంటూ, బయటకు నడిచాము.

"శేఖరం మాట," అంటూ పిలిచింది. నా భుజం పై చెయ్యి వేసి, నన్ను ఆసరాగా పట్టుకొని బయటకు నడిచింది. వెచ్చని, ఆత్మీయమైన స్పర్శ, నా శరీరమంతా.

"నీ ఉత్తరం రాత్రి మళ్ళీ మళ్ళీ చదువుకున్నాను. 'ప్రపంచానికి నా అపాలజీ' అనడం ఎంతో దిగులు వేసింది," అన్నాను. మాలతి ఏం మాట్లాడలేదు. గట్టిగా నిట్టూర్చింది.

స్ట్రీట్‌లైటు తాలూకు వెలుగుపడి, మాలతి దేవతా విగ్రహంలా మెరిసిపోయింది. కారులో కూర్చుంటూ, చేతులు రెండూ విశాలంగా సాచి, ప్రపంచాన్ని తన కౌగిలిలోకి ఆహ్వానిస్తున్నట్లు, "ఆనందంగా ఉంది. పురాతనమైన కలలా ఉంది. థాంక్యూ ఫర్ ఎవ్విరి థింగ్," అంది.

*('మో' కోసం)*

*ఆదివారం సాక్షి, 31 జులై 2011*